# సవతి తల్లి

శ్రీ పిళ్లా సుబ్బారావుశాస్త్రి

ఆరోజు దీపావళి. వూరంతా దీపాల కాంతితో కళకళలాడుతోంది. పిల్లలూ పెద్దలూ అంతా బాణాసంచా కాలుస్తున్నారు. ముఖ్యంగా పిల్లలందరూ ఆ రోజు ఎంతో ఉత్సాహంగానున్నారు. గుమ్మాలకు తోరణాలు, రంగుకాగితాలు కట్టుకుంటున్నారు. కొందరు చిత్రవిచిత్రంగా దీపాలను తమయిళ్లపైన, ఇంటిముందూ అమరుస్తున్నారు – పిల్లలంతా క్రొత్తబట్టలు వేసుకున్నారు. కాని రామూ మాత్రం చినిగిపోయినచొక్కా, మాసిన జుట్టూ, వాడిపోయిన ముఖంతో ఓ పెద్ద బిందె బుజానపెట్టుకుని మోస్తున్నాడు.

రామూ వీథంట నీళ్లబిందె మోసుకు పోతూవుంటే కొంతమంది పిల్లలు రామూని చూసి ఎగతాళిచేస్తున్నారు. మరికొంత మంది వెక్కిరిస్తున్నారు.

"పాపం! పండంటికుర్రాడు... వాళ్ల అమ్మే బ్రతికివుంటే యిలావుండేవాడా!" ఒకామె జాలిగా రెండో ఆవిడతో అంది. ఆమాటలు రామూకు వినిపించగానే కళ్లంట నీళ్లు గిర్రున తిరిగాయి. "నాకు అమ్మ లేదా...!" అనుకున్నాడు – వెనక్కి తిరిగాడు. ఆమాటలు అన్న ఆమె అక్కణ్నే వుంది. గబగబా ఆమెదగ్గరకి వెళ్లాడు.

"అమ్మగారూ! చెప్పండి...! నిజంగా నాకు అమ్మ లేదా....?" బిందెని క్రిందకి దించి ఆమెకాళ్లు పట్టుకు అమాయకంగా ప్రశ్నించాడు. ఆమె ముందు చెప్పడానికి తటపటాయించింది. కాని పిల్లవాడు బ్రతిమలాడుతూవుంటే ఆమాతృ హృదయం కరిగిపోయింది. రామూని లేపి కళ్లు తుడుస్తూ చెప్పింది – "లేదునాయనా! నీకు అప్పటికి ఐదేళ్లు వుంటాయి. మీఅమ్మకి కలరా వచ్చింది! .... వూరు అంతా కలరావ్యాధి కమ్మేసింది! ఆ రోజుల్లో మీఅమ్మ చచ్చిపోయింది! ... ఏడవకు...! ఎంత ఏడ్చినా చచ్చినవారు లేచివస్తారా? – తర్వాత మీనాన్నగారు యీ కమలను వివాహం చేసుకున్నారు! కమల నీ సవతి తల్లి..."

రామూ దుఃఖాని దిగమ్రింగుకు యింటికి బయలుదేరాడు. రాత్రి తిండి లేదు...! ప్రొద్దుటమాత్రం ఇన్ని గంజినీళ్లు తాగేడు ..!! 'ఏం! రామూ బీద వాడా...?'–కాదు. బీదవాడుకాదు! సంపన్నుని కొడుకు! కాని తల్లి లేనివాడు.!!

"ఏంరా! ఇంత ఆలస్యం? – అబ్బ! అరుగంటలకు వెళ్లాడు...! ఇప్పుడా రావటం...!" కాళికాదేవిలా ప్రత్యక్షమయింది గుమ్మంలో కమల

“లేదమ్మా! పంపు దగ్గర జనం ఎక్కువవున్నారు...!” అన్నాడు రామూ వెక్లెక్కుతూ. “ఏడిచావులే ఏడుపు...!” అందికమల - “ఏమే! పనిమనిషి ఏమయిందీ-” అని అడిగాడు రామూ తండ్రి కమలను.

“మీరు నోరుమూసుకోండి!... నేనూ చదువుకున్నాను...! నాకు తెలుసు! తిండి తిని కూర్చుంటే పిల్లలకి అజీర్తిచేస్తుంది...!” కమల అనగానే నోరు మూసుకుని చిన్న అమ్మాయితో ఆడుకుంటో కూర్చున్నాడు.

రామూ మెట్లు ఎక్కుతూ మెట్లమీది నుంచి తూలి పోయాడు క్రిందకి. కమల “ఓరి వెధవా! మా అమ్మగారి బిందెను పొట్టన పెట్టుకున్నావుకదరా...!” అంటూ గబగబా పరుగెత్తి బిందెను తీసుకువచ్చేసింది! రామూను లేపటానికి వెళ్ళబోయే భర్తని కూర్చీలోకి ఒక్కతోపుత్రోసి “వాడే లేస్తాడు...!” అంది. భార్య చేతిలో కీలుబొమ్మ అయిపోయిన రంగనాథం నోరుమూసుకు కూర్చున్నాడు!

రామూ దెబ్బలను వూదుకుంటూ వంటయింట్లోకి ప్రవేశించాడు. “ఏం! వచ్చావా!... హుఁ,.. వెళ్ళు, మరిరెండు బిందెలు నీళ్ళు తగలబెట్టి, గదులన్నీ ఊడ్చి, దీపాలు వెలిగించాలి! ... పో ...!” అని ఆజ్ఞాపించింది.

“అమ్మా! ఆకలేస్తోంది!....ఇంత కాఫీ యివ్వు...!” అన్నాడు దీనంగారాము. “కాఫీ..? కాఫీ లేదు గీఫీ లేదు.!” అంది తనకూతురుకి పాలుపడుతూ కమల.

రాత్రి బాణాసంచా అంతా కాలుస్తున్నారు. రామూ దీనంగా చూస్తూనుంచున్నాడు. కమల అందరిళ్ళపిల్లలకి దీపావళి సామాను పంచిపెడుతూ, తనపిల్లచేత కాలిపిస్తూ.ఆనందంగావుంది.

తొమ్మిదిగంటలు కొట్టారు. రామూ దీపాలప్రదిమలలో నూనె పోస్తున్నాడు. కమల, అమ్మాయిని ఒడిలోకూర్చోపెట్టుకు సామాను కాలుస్తూ ‘అమ్మాయ్! నువ్వు కూర్చో.! నేనుపోయి మిఠాయి తెచ్చియిస్తా’నని వెళ్తుంది. మేడమీదనుంచి క్రిందకు—మేడ అంటుకుంది...! భగభగ మండుతోందిమేడ...!-బైటకు పరిగెత్తారంతా. కాని అమ్మాయి మాత్రం ఏడుస్తోంది!

“పాప వుండిపోయిందండీ...!” అంది కమల గోలపెడ్తూ. ఎవరూ వెళ్ళరావె!- రామూ గబగబా పరిగెత్తాడు మేడపైకి- చెల్లెల్ని యెత్తుకుని కూలిపోతున్న మేడమీదనుండి ఒక్కవూపని గెంతేశాడు...!! అంతే! రామూ పూర్తిగా చితికిపోయాడు! కాని అమ్మాయికి మాత్రం దెబ్బలు తగలలేదు ...!!!

“డాక్టర్...!” అన్నాడు రంగనాథం. “లాభంలేదు...!” అన్నారు అంతా.

“అమ్మా! వస్తున్నా...! పిలిచావు కదూ...!” అని కేకవేసి శాశ్వతంగా కళ్ళు మూసుకున్నాడు రామూ!!!